క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం



అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు

ఎస్.రాయవరం : గ్రామీణ పాఠశాలలో పని చేస్తూ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకోవడం అభినందనీయమని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.కె.ఎల్.ఎన్. ధర్మారావు అన్నారు. లింగరాజుపాలెం గ్రామం ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న కొణతాల ఫణిభూషణ శ్రీధర్‌ని పాఠశాలలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. బయోడైవర్సిటీ అవార్డుకు వరుసగా రెండు దఫాలు ఎంపికై, ఇప్పుడు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు యండపల్లి ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేత

కోటవురట్ల : కైలాసపట్నం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి యండపల్లి ఫీడర్‌లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వి.డి.వి.రామకృష్ణారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జంగిల్ క్లియరెన్సు చేపడుతున్న కారణంగా యండపల్లి ఫీడర్ పరిధిలో ఉన్న తంగేడు, సుంకపూరు, జల్లూరు, బి.కె.పల్లి గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాచి చల్లార్చిన నీళ్లు తాగండి



జేవీపాలెం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: డయేరియా బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. వాసంతి అన్నారు. జేవీపాలెం గ్రామంలో శుక్రవారం డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాల సీజన్ కారణంగా గ్రామాల్లో తాగునీరు కలుషితం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. అనంతరం దోమల సమస్య లేకుండా పరిసరాలు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం... జాగ్రత్తలు అవసరం



కట్టుబోలులో ర్యాలీ

రాంబిల్లి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వుండాలని దిమిలి పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్ఎస్‌వీఎన్ రాజు అన్నారు. కట్టుబోలు, మురకాడ గ్రామాల్లో శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ ధనరాజు వైద్య సిబ్బంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత పెంపొందించాలి



కొత్తపేటలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న సమరసత సభ్యులు

రాంబిల్లి : గ్రామాల్లో ఆధ్యాత్మికతను పెంపొందించాలని సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ సూరాడ నూకరాజు అన్నారు. శుక్రవారం కొత్తపేటలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యుల సమావేశం జరిగింది. తొలుత ఆంజనేయస్వామిని సమరసత సభ్యులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సమరసత సభ్యులు అప్పారావు, గగన్ పాల్గొన్నారు.

నేడు అచ్యుతాపురం మండల సమావేశం

అచ్యుతాపురం : అచ్యుతాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 6వ తేదీ ఉదయం పదిన్నర గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండల స్థాయి అధికారులు, సభ్యులు హాజరు కావాలని ఆయన సూచించారు.

టీకాలతో జూనోటిక్ వ్యాధుల నియంత్రణ

యలమంచిలి : ఈనెల 6న యలమంచిలి పశువైద్య కేంద్రం వద్ద కుక్కలకు ఉచితంగా టీకాలు వేయడం జరుగుతుందని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సీహెచ్.ఎం.ఎం గంగాధర్ ఒక ప్రకటనలో శుక్రవారం సాయంత్రం పేర్కొన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా కుక్క కాటు ద్వారా వ్యాధులు రాకుండా కుక్కలకు టీకాలు వేయడం జరుగుతుందని యలమంచిలి పరిసర ప్రాంతాలకు చెందిన వారు ఎవరైనా తమ పెంపుడు కుక్కలకు టీకాలు వేయించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకొని కుక్క కాటు ద్వారా ప్రాణాంతక వ్యాధులు సంక్రమించకుండా నిరోధించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. కుక్కకాటుపై ప్రజల్లో ఆరోగ్య విజ్ఞానంపై అవగాహన కల్పించడం జరుగుతుందని, వ్యక్తిగత పరిశుభ్రత, అనారోగ్య అలవాట్లు మానుకునేలా, జూనోసిస్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం జరుగుతుందని, అలాగే పెంపుడు కుక్కలకు ప్రతి పశువుల ఆస్పత్రిలో ర్యాబిస్ టీకాలు తప్పక వేయించాలని కోరారు.

పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించండి..

కోటవురట్ల : పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేయించాలని పశు సంవర్ధకశాఖ వైద్యాధికారి డాక్టర్ బాబూరావు పడాల్ సూచించారు. కె.వెంకటాపురంలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు జూనోటిక్ వ్యాధులపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు జూనోటిక్ వ్యాధులు సంక్రమిస్తాయని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంట్లో పెంపుడు కుక్కల ద్వారా రాబిస్ వ్యాధి సోకుతుందని, ముందుగా యాంటీ రాబిస్ టీకా వేయడం ద్వారా ప్రమాదాన్ని నివారించవచ్చన్నారు. మండలంలోని ప్రతి పశు సంవర్ధక శాఖ కార్యాలయం వద్ద శనివారం యాంటీ రాబిస్ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం షేక్ అల్లావుద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జెడ్పీ హైస్కూల్‌లో జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బాబూరావు పడాల్

ప్రజల మన్ననలు పొందే విధంగా సేవలు

నాతవరం: ప్రజల మనన్నలు పొందే విధంగా ప్రతి ఉద్యోగి విధులు నిర్వర్తిస్తే, సమాజంలో ఎల్లప్పుడూ గౌరవం లభిస్తుందని ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో పని చేస్తున్న గ్రంథాలయాధికారి ఆర్.కన్నబాబు పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం స్థానిక కల్యాణ మండపంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నాతవరం గ్రంథాలయానికి కన్నబాబు వన్నె తెచ్చారన్నారు. వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగులకు ప్రజాప్రతినిధులకు అధికారులకు అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచేవారన్నారు. అనేక విజ్ఞాన, సాంస్కృతిక, తదితర కార్యక్రమాలు నిర్వహించారన్నారు. వీటి నిర్వహణకు సొంత నిధులు వెచ్చించారని ప్రశంసించారు. గ్రంథాలయంలో చదువుకుని అనేక మంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారన్నారు. అనంతరం గ్రంథాలయాధికారి కన్నబాబు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నేతల విజయకుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు పైల పోతురాజు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు త్రిమూర్తులురెడ్డి, మాజీ ఎంపీటీసీ బంగారు సూరిబాబు, విశ్రాంత గ్రంథాలయాధికారి మురళి, ఉపాధ్యాయులు, వివిధ మండలాలకు చెందిన గ్రంథపాలకులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



కన్నబాబు దంపతులను సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్

నర్సీపట్నం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కార్మిక చట్టాలను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. వివిధ రకాల అసంఘిటిత రంగ కార్మికులతో శుక్రవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యాజమాన్యాలకు మేలు చేసే విధంగా 40 కార్మిక చట్టాలను తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టాల వల్ల కార్మికులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. యాజమాన్యాలపై కార్మికులు పోరాటం చేసే హక్కును కోల్పోతారన్నారు. నూతన రవాణా చట్టాలను మార్చేశారన్నారు. ఈ నెల 10న తలపెట్టిన ధరాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాజు, కార్మికులు

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ



తెగులు పట్టిన మినప పంటలో పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

రోలుగుంట: మండలంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రైతులు స్వల్పకాలిక రకాలైన మినప, పెసర, బొబ్బర తదితర అపరాల పంటలను విస్తారంగా సాగు చేపట్టారు. కొమరవోలు, రోలుగుంట, కొండపాలెం, శరభవరం, వడ్డిప, జె.నాయుడుపాలెం తదితర గ్రామాల్లో పండిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో పూత, మరికొన్ని గ్రామాల్లో పిందె దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పచ్చపురుగు తెగులు ఆశించి ఆకుల చుట్టూ రంధ్రాలు ఏర్పడడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి పలు సూచనలు చేశారు. అపరాల పంట వేసిన నెలలోనే తెగులు ఆశిస్తుందన్నారు. ఆకుపచ్చ పురుగు ఆకుల పత్రహరితాన్ని గోకి తిని ఆకులకు రంధ్రాలు పెడుతుందన్నారు. దీనివల్ల దిగుబడులు తగ్గిపోతాయన్నారు. పచ్చపురుగు నివారణకు గాను క్లోరోపైరిపోస్ 2.5 ఎం.ఎల్‌ను లీటరు నీటిలో లేదా ఎస్పేట్ 1.5 గ్రాము లీటరు నీటిలో మిశ్రమం చేసి పిచికారీ చేసుకుని పంటలను సంరక్షించుకోవాలన్నారు.

వానరాలతో హడలిపోతున్న ప్రజలు

మాకవరపాలెం: వానరాల సంచారంతో ప్రజలు హడలిపోతున్నారు. స్థానిక కిందివీధి, రాజారావుపేట ప్రాంతాల్లో చాలా రోజులుగా వానర దండు సంచరిస్తోంది. అధిక సంఖ్యలో తిరిగే వానరాలు ఇళ్లలోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేస్తున్నాయని, ఆ సమయంలో అడ్డుకుంటే తిరగబడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వానరాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో బోన్లు ఏర్పాటు చేసి బంధించే వారన్నారు. ప్రస్తుతం అధికారులు బోన్లు ఏర్పాటు చేసి వానరాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నివాసాల మధ్య సంచరిస్తున్న వానరాలు

ధ్యానంతో మానసిక ప్రశాంతత

అనకాపల్లి: నిత్యం ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని ధ్యాన ఆశ్రమం శ్రీ గీజా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వ్యవస్థాపక ప్రతినిధి నరేంద్ర ముదల్కర్ అన్నారు. స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం ధ్యానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడితో మనుషుల జీవనశైలిలో మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. కోవిడ్ తరువాత ప్రతి వ్యక్తి వ్యాయామం, ధ్యానం, యోగాపై ఆసక్తి పెంచుకున్నట్లు పేర్కొన్నారు. ఒత్తిడితో శరీరం పలు వ్యాధుల బారిన పడే అవకాశాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



ధ్యానంపై అవగాహన కలిగిస్తున్న సరేంద్ర ముదల్కర్

వృద్ధులకు రైలు ప్రయాణాల్లో రాయితీ కల్పించాలి

అనకాపల్లి: పట్టణ పరిధిలో వృద్ధులు సమావేశాలు నిర్వహించుకునేందుకు నూతన భవనం కోసం ప్రజాప్రతినిధులు, కలెక్టర్‌ను కలిసి విన్నవించుకోనున్నట్లు జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు తెలిపారు. స్థానిక గవరపాలెం వీవీ రమణ రైతు భారతి హాల్లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధుల సమస్యల్ని గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రైల్లో ప్రయాణించే సమయంలో చార్జీల్లో రాయితీలు కల్పించాలన్నారు. 60 ఏళ్లు దాటిని వృద్ధులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు అందజేయాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘం సభ్యులు శరగడం నూకరాజు, విజయలక్ష్మి, విల్లూరి రాము, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న జయంతికి ఘనంగా ఏర్పాట్లు



తిమ్మరాజుపేటలో మహానేత విగ్రహానికి రంగులు వేసే పనులను పరిశీలిస్తున్న ఉప సర్పంచ్ జగన్

మునగపాక : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాటు చేస్తున్నారు. జూలై 8న జరగనున్న జయంతికి సంబంధించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన రాజన్న విగ్రహాలను శుభ్రం చేయించడంతో పాటు రంగులు వేసే కార్యక్రమాలను చేపడుతున్నారు. దీనిలో భాగంగా తిమ్మరాజుపేటలో ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ శుక్రవారం దగ్గరుండి రంగులు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు.

నిరుపేద వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత నాగిరెడ్డి

మునగపాక : తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మండలంలోని కాకరాపల్లి వైఎస్సార్‌సీపీ నేత కర్రి నాగిరెడ్డి శుక్రవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. తోటాడలోని భావనారుషి దేవస్థానం ఆవరణలో కర్రి శ్రీరాములు, దేములమ్మల జ్ఞాపకార్థం పలువురు వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ఏటా తన తల్లిదండ్రుల పేరిట వృద్ధులకు తనవంతు సాయంగా సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నానన్నారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ పేదలకు సాయం అందించాలని కోరారు.

పాల సంఘం అధ్యక్షుల ఎన్నిక



అధ్యక్షులను అభినందిస్తున్న రైతు సంఘ నాయకులు

బుచ్చెయ్యపేట: మండలంలోని నాల్గు గ్రామాల్లో విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షులను ఆయా గ్రామాల డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయా గ్రామాల పాల కేంద్రాల వద్ద శుక్రవారం ఈ ఎన్నిక నిర్వహించారు. పి. భీమవరంలో వలివిరెడ్డి రాజబాబు, ఐయితంపూడిలో అప్పాన తాతబాబు, సీతయ్యపేటలో నందవరపు రాజబాబు, గొర్లెపాలెంలో శొంఠ్యాన శ్రీను అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. వీరిని ఆయా గ్రామాల రైతు సంఘం నాయకులు అభినందించారు.

మోదమాంబ ఆలయానికి ధమరుకం వితరణ

మాడుగుల రూరల్: ఎం. కోడూరు మోదమాంబ ఆలయానికి దాతల సహకారంతో వాయిద్యనాదం (ధమరుకం)ను శుక్రవారం వితరణగా అందజేశారు. గ్రామానికి చెందిన కలిమి వెంకటరమణ కుమారుడు సంతోష్, వరలక్ష్మి దంపతులు, మజ్జి సముద్రం కుమారుడు జగన్నాథరావు(ఆర్మీ) అనురాధ దంపతులతో పాటు గోకాడ కొండలరావు, కృష్ణవేణి దంపతుల ఆర్థిక సాయంతో దీన్ని కొనుగోలు చేశారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకులకు అందజేశారు. పడాల అప్పలనర్సయ్య, నత్తల వరహమూర్తి, కలిమి గోపాల్, పోతిన జగదీష్ పాల్గొన్నారు.



ఆలయ ప్రధాన అర్చకులకు ధమరుకం అందజేస్తున్న సర్పంచ్ సంజీవిరావు

సింహాచలం నాయుడికి ఘన నివాళి

కోటవురట్ల : బి.కె.పల్లిలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ తండ్రి సింహాచల నాయుడి వర్థంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర గణేష్ గ్రామంలో ఉన్న సింహాచలనాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడి నుంచి తన తండ్రి పేరున నిర్మించిన పార్కులో ఆయనను స్మరించుకున్నారు. పొలంలో ఉన్న సమాధి వద్ద కుటుంబసభ్యులంతా పూలమాలలు ఉంచి నివాళి అర్పించారు. సింహాచల నాయుడు ప్రజాప్రతినిధిగా గ్రామంలో విశేష సేవలందించారు. ఆయన ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తామని ఉమాశంకర గణేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పెట్ల రాంబాబు, మాజీ ఉప సర్పంచ్ పెట్ల వెంకటరమణ, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



బి.కె.పల్లిలో తండ్రి సింహాచలనాయుడు సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర గణేష్

పాఠశాలల్లో హోంమంత్రి ఆకస్మిక తనిఖీ

పాయకరావుపేట : గంజాయి రహిత రాష్ట్రంగా ఆంధ్రాను చూడబోతున్నామని, గంజాయి పై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆమె పట్టణంలో పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలను సందర్శించి ఆయాచోట్ల మధ్యాహ్న భోజనం పథకం అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా పరిష్కరించడానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, తహసీల్దార్ జె.సూర్యనారాయణ, ఎంపీడీవో కె.స్వప్న, ఎంఈవోలు కె.ఎస్. గాంధీ, కె.రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: కస్తూర్బా విద్యాలయంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హోంమంత్రి వంగలపూడి అనిత హామీ ఇచ్చారు. నియోజకవర్గం పర్యటనకు విచ్చేసిన మంత్రి శుక్రవారం రాత్రి తిమ్మాపురం కస్తూర్బా విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల కోసం వండిన వంటలను పరిశీలించారు. సాంబారులో నాణ్యత లోపించడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.



ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

మునగపాక : మూలపేట గ్రామానికి పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు అన్నారు. మండలంలోని మూలపేట పంచాయతీ గ్రామ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి సమస్య రాకుండా పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. అలాగే ప్రజలు సీజన్‌లో అంటురోగాలు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నా రు. మూలపేట గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ, పాలకవర్గ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

122 ఆవులకు లంపీస్కిన్ నివారణ టీకాలు

కె.కోటపాడు: లంపీస్కిన్ బారిన పడకుండా ఉండేందుకు పశువైద్య కేంద్రాల ద్వారా పశువులకు ఉచితంగా వ్యాక్సిన్ వేస్తున్నట్లు కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు తెలిపారు. శుక్రవారం కొరువాడ, డి.అగ్రహారం గ్రామాల్లో 122 ఆవులకు లంపీస్కిన్ వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ ఆవులకు లంపీస్కిన్ వైరస్ సోకే పరిస్థితి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ వ్యాధి బారిన పడిన పశువుల శరీరంపై బుడిపెలతో కూడిన పుండ్లు ఏర్పడడంతో కాళ్ల వాపు, ఆహారం సమంగా తీసుకోలేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలతో పశువు నీరసించి, మరణించే పరిస్థితికి చేరుకుంటుందని పేర్కొన్నారు. లంపీస్కిన్ నుంచి రక్షించేందుకు పశువులకు జూలై, ఆగస్టులో ఉచితంగా వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. రైతులంతా తప్పనిసరిగా ఆవులకు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. శనివారం పశు వైద్య కేంద్రాలతో పాటు రైతు సేవా కేంద్రాల్లో జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలను వేయనున్నట్లు తెలిపారు.



లంపీస్కిన్ టీకాలను ఆవులకు వేస్తున్న పశువైద్యాధికారి నాయుడు

ఖరీఫ్ నాట్లకు నారుమడులు సిద్ధం



వరాహనదిలో నీరుప్రవహిస్తున్న దృశ్యం



కొరుప్రోలులో నారుమడులు దున్నుతున్న దృశ్యం

ఎస్.రాయవరం : ఖరీఫ్ నాట్లకు సిద్ధమయ్యే అన్నదాతలు పొలాల్లో నారుమడులు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. పంటలకు ప్రధానంగా జీవనాధారం అయిన వరాహనదిలో నీటి ప్రారంభం అయ్యేసరికి అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు వరికి అనుకూలమని వరినారులు వేస్తున్నారు. కొరుప్రోలు , పెద ఉప్పలం, తిమ్మాపురం , పెదగుమ్మలూరు తదితర గ్రామాల్లో జోరుగా వరినాట్లు వేస్తున్నారు. దీనికి తోడు వరాహనది ప్రవాహం కూడా జోరుగా ఉంది, నదిలో మరమ్మతులకు గురైన గ్రోయిన్లకు తాత్కాలికంగా మరమ్మతులు కూడా పూర్తి చేశారు. ఈ మేరకు నదిలో నీరు అన్ని పాయలకు నీరు సక్రమంగా పారుతోంది. దీంతో నారుమడులు సిద్ధం చేసుకుంటే , నాట్లు వేయవచ్చన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వ్యవసాయ అధికారులు రైతులకు అవసరమయిన విత్తనాలు ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేశారు.

ఆకుమడులకు మేలు చేసిన వర్షం

బుచ్చెయ్యపేట: మండలంలో కురిసిన వర్షం వరి ఆకుమడులకు మేలు చేసింది. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షం వల్ల రైతులు వేసిన ఆకుమడులకు నీరందింది. ఖరీఫ్ సీజన్ ఆరంభంతో పది రోజులుగా గంటికొర్లాం, కొమళ్లపూడి, బుదిరెడ్లపాలెం, పీడీ పాలెం, శింగవరం, లోపూడి, బంగారుమెట్ట, ఎల్బీపురం, తదితర గ్రామాల్లో రైతులు జోరుగా వరి ఆకుపోతలు వేశారు. వేసిన వరి విత్తనాలకు పదును అందక విత్తనాలు మొలకెత్తకుండా భూమిలోనే ఉండిపోయాయి. కురిసిన వర్షంతో పలు గ్రామాల్లో ఆకుమడుల్లో నీరు చేరింది. వరి ఆకు మొలకెత్తడానికి సరిపడ్డ పదును ఏర్పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురవకపోతే బిందెలతో నీళ్లు మోసి ఆకుమడులు తడపాల్సి వచ్చేదని వాపోయారు.



బంగారుమెట్ట పొలాల్లో వర్షంతో తడిచిన ఆకుమడి